
సాక్షి నిర్మల్

గురువారం | 5 | జూన్ | 2025



పర్యావరణమే పరమౌషధం!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం తగ్గుతుండగా ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తంజేస్తున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కథనం.. 12లో▸



'నవోదయ'ం పిలుస్తోంది!

కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ఆరోతరగతిలో ప్రవేశానికి ఆహ్వానం పలుకుతోంది. డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష నిర్వహించనుండగా దరఖాస్తులు స్వీకరిస్తోంది. 12లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /25.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న జానకీ షర్మిల

భైంసాటౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ జానకీ షర్మిల సూచించారు. బుధవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి భైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వాటి పరిష్కారానికి సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్‌లో సూచనలు చేశారు. అలాగే భరోసా కేంద్రంలో కుటుంబ కలహాలకు సంబంధించి కేసుల్లో ఇరు పార్టీలకు కౌన్సెలింగ్ ఇప్పించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, సీఐలు గోపీనాథ్, నైలు, మల్లేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సమ్మయ్య, ఎస్సైలు శ్రీనివాస్, శంకర్, మహిళా ఎస్సై పెర్సిస్, షీ టీమ్ సిబ్బంది, క్యాంప్ ఇన్‌చార్జి రఘువీర్ పాల్గొన్నారు.

డీఎస్సీ-2024 టీచర్‌కు షోకాజ్ నోటీస్!

నిర్మల్ రూరల్: డీఎస్సీ–2024లో నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందినందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఓ ఉపాధ్యాయునికి షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు చెందిన గైని సునీల్‌కుమార్ డీఎస్సీ-2024లో ఎస్జీటీ ఉద్యోగం పొందాడు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో అతను నకిలీ పత్రాలు అందించి ఉద్యోగం పొందినట్లు విద్యాశాఖకు ఫిర్యాదులు అందాయి. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు అందడంతో విద్యాశాఖ అధికారులు క్షుణ్ణంగా విచారణ చేపట్టారు. విచారణలో గైని సునీల్ అందించిన స్పెషల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ నకిలీదని తేలింది. దీంతో స్కూల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఉపాధ్యాయుని అనర్హుడిగా ప్రకటించి షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా డీఈవో రామారావును ఆదేశించారు.

'పది' సప్లిమెంటరీకి ఏడుగురు గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో బుధవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 మందికి గాను నలుగురు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ముదారపు పరమేశ్వర్ తనిఖీ చేశారు.

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగీ లాంటి సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాధాన్యత గల ప్రాంతాల్లో డ్రెయినేజీలు శుభ్రపరచాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శానిటేషన్ కార్యక్రమాల్లో పాల్గొనే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, పని ప్రమాణానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. మలేరియా దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేయాలని తెలిపారు. గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంల ద్వారా ప్రజల్లో శుభ్రతపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలకు సంబంధించిన అంశాలపై మండలాల వారీగా చర్చించారు. వనమహోత్సవంపై దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, డీఈవో రామారావు, సంక్షేమ శాఖల అధికారులున్నారు.

మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన పరిశీలకులు



మీనాక్షితో ఉమ్మడి జిల్లా పరిశీలకులు

నిర్మల్: తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్‌ను ఉమ్మడి జిల్లా పీసీసీ పరిశీలకులు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కలిశారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల అబ్జర్వర్లుగా నియమితులైన నుంచి ఆయా జిల్లాల్లో పార్టీ పరిస్థితులపై పూర్తి నివేదికలిచ్చారు.

డ్రగ్ ఫ్రీ నిర్మల్!



- జిల్లాలో 'మత్తు'పై ఉక్కుపాదం
- గంజాయి రహిత జిల్లాకు కృషి
- కలెక్టర్, ఎస్పీ సంయుక్త కార్యక్రమం
- ఊరూరా.. వాడవాడలా అవగాహన
- ప్రచార రథాన్ని ప్రారంభించిన కలెక్టర్
- 'గాంజా గస్తీ' చేపడుతున్న ఎస్పీ



డ్రగ్ ఫ్రీ నిర్మల్ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్: ఊరూరా.. వాడవాడలా.. జిల్లా నలుమూలలా గంజాయి భూతం వ్యాపించింది. యువతరాన్ని మత్తుకు బానిసలుగా మార్చి, వారి జీవితాలను నాశనం చేస్తోంది. దారుణమేమంటే.. బడీడు పిల్లల భవితనూ పీల్చేస్తోంది. నాలుగు డబ్బులు సంపాదించాలన్న కొంతమంది స్వార్థం సమాజాన్ని నాశనం చేసే దిశగా తీసుకెళ్తోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అంతటా గంజాయిదందా విస్తరించడం ఆందోళనకరమైన విషయం.

కొందరి స్వార్థం.. సమాజం నాశనం

కుభీర్ నుంచి కడెం దాకా జిల్లావ్యాప్తంగా గంజాయి గుప్పుమంటోంది. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడుల్లో మారుమూల పల్లెలు, తండాల్లో గంజాయి సాగుతో పాటు మత్తుమందును పీలుస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. సాక్షాత్తు జిల్లాకేంద్రంలోనే కొన్ని శివారు ప్రాంతాలు గాంజా అడ్డాలుగా మారాయి. అడ్డదారుల్లో ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలన్న కొంతమంది స్వార్థానికి సమాజమే నాశనమవుతోంది. తక్కువ పైసలతో ఎక్కువ మత్తు వస్తుందంటూ యువతను గంజాయివైపు ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల గంజాయితో పాటు మత్తుమందు ఇంజక్షన్లను విక్రయిస్తున్న ముఠా ఏకంగా జిల్లాకేంద్రంలోనే వెలుగులోకి రావడం తెలిసిందే. యువతతో మత్తు ఎక్కించడమే కాకుండా వారినే విక్రేతలుగా మారుస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్రతో పాటు వివిధ జిల్లాల నుంచి ఇక్కడికి గంజాయి వస్తోంది. గతంలో కొంతమంది యువకులు జిల్లా నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లి గంజాయి విక్రయించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

బడీడు పిల్లలకూ..

జిల్లాలో గంజాయి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. యువత వరకే ఆగిపోకుండా ఈ మత్తు బడీడు పిల్లలకూ చేరుతోంది. జిల్లాకేంద్రంతో పాటు పలు గ్రామాల్లోనూ బడిపిల్లలు గంజాయి బారినపడ్డ విషయం వెలుగులోకి వచ్చింది. కొంతమంది గంజాయికి బానిసలుగా మారి, డబ్బుల కోసం తమ ఇంట్లోనే దొంగతనాలు చేసిన దాఖలాలున్నాయి. పలువురు యువకులు రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలూ కోల్పోయారు. ఇప్పటికే చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను డీ అడిక్షన్ కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. స్థానికంగా కాకుండా నిజామాబాద్, హైదరాబాద్ ఆస్పత్రులకు వెళ్లి మానసిక చికిత్స చేయిస్తున్నారు.



మత్తుమందు ముఠా వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీషర్మిల (ఫైల్)

పెరుగుతున్న ఫిర్యాదులు

జిల్లాలో రోజురోజుకూ గంజాయి తీవ్రతతో పాటు ఫిర్యాదుల సంఖ్య పెరుగుతుండటంతో కలెక్టర్ అభిలాషఅభినవ్, ఎస్పీ జానకీషర్మిల సమష్టి నిర్ణయం తీసుకున్నారు. గంజాయి విముక్త నిర్మల్ జిల్లా చేయాలన్న లక్ష్యంతో 'డ్రగ్ ఫ్రీ నిర్మల్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మత్తుమందులపై ఉక్కుపాదం మోపేందుకు అందరి సహకారం కావాలంటున్నారు. ఇప్పటికే 'గాంజా గస్తీ' పేరిట ఎస్పీ జానకీషర్మిల పకడ్బందీగా గంజాయి అమ్మకాలపై దాడులు చేపడుతున్నారు. మత్తుపదార్థాలకు సంబంధించి సమాచారం 8712659599 నంబర్‌లో ఇవ్వాలంటూ సూచిస్తున్నారు. ఈ నంబర్‌కు వస్తున్న ఫిర్యాదులు, వరుస తనిఖీల ఆధారంగా కొంతకాలంగా చాలామంది గంజాయి విక్రేతలను పట్టుకుంటున్నారు.

అవగాహన కల్పించేందుకు..

అవగాహన లోపం కారణంగానే ఎక్కువమంది యువకులు, విద్యార్థులు గంజాయి బారిన పడుతున్నట్లు తేలడంతో ఆ దిశగా జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. 'డ్రగ్ ఫ్రీ నిర్మల్'లో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ అభిలాషఅభినవ్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ బృందానికి సంబంధించిన వాహనానికి పచ్చజెండా ఊపారు. జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి బృందాలతో జిల్లా నలుమూలలా గంజాయితో కలిగే అనర్థాలతో పాటు బాల్యవివాహాలు, బాలకార్మికులు తదితర అంశాలపైనా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్దన్, కళాకారులు సుదర్శన్, నాగరాజు, రఘునాథ్, లక్ష్మణ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్ అంధకారం



మత్తుపదార్థాల కారణంగా యువత భవిష్యత్ అంధకారమవుతోంది. ఉజ్వల భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకోవద్దు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన ప్రారంభించిన 'డ్రగ్ ఫ్రీ నిర్మల్' కార్యక్రమంలో అందరం భాగస్వాములమవుదాం. మత్తురహిత జిల్లాకు కృషిచేద్దాం. – అభిలాషఅభినవ్, కలెక్టర్

కలిసికట్టుగా కృషి చేస్తేనే..



జిల్లాలో మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలపై శాఖాపరంగా సీరియస్‌గా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే 'గాంజా గస్తీ' చేపడుతున్నాం. యువతను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ 'డ్రగ్ ఫ్రీ నిర్మల్' కోసం ఐక్యంగా ముందుకురావాల్సిన అవసరముంది. – జానకీషర్మిల, ఎస్పీ

భూసమస్యలపై దరఖాస్తు చేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

లోకేశ్వరం: భూసమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం మండలంలోని ఎడ్దూర్, వట్టోలి గ్రామాల్లో నిర్వహించిన భూభారతి సదస్సులకు హాజరయ్యారు. రైతుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అర్లి నుంచి ఎడ్దూర్ వరకు అధ్వానంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. అదనపు కలెక్టరు కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ సర్వరాజ్ అహ్మద్, డీటీ రవీందర్ ఉన్నారు.

నర్సాపూర్ (జి): మండలంలోని బూరుగుపల్లి (కె) గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించగా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరయ్యారు. అంతకుముందు సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో చర్లపల్లిలో 12, బూరుగుపల్లి (కె)లో ఒక దరఖాస్తు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీటీ వాహిదొద్దీన్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎడ్దూర్‌లో రైతుల దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

నిర్మల్‌చైన్‌గేట్: రెవెన్యూ సదస్సులకు హాజరయ్యే రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో సూచించారు. సోషల్ మీడియాలో వైరలైన గ్రామ రెవెన్యూ సదస్సులకు సంబంధించిన వీడియోపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సైని సస్పెండ్ చేసి, విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 3నుంచి 20వరకు రెండోవిడత సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 36 రెవెన్యూ గ్రామాల్లో వెయ్యికి పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

మిల్లర్లపై చట్టపరమైన చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: దీర్ఘకాలంగా సీఎంఆర్ ధాన్యాన్ని ఇవ్వని రైస్ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి చెందే సీఎంఆర్ (కస్టమర్ మిల్లింగ్ రైస్) ధాన్యాన్ని దీర్ఘకాలంగా ఇవ్వని రైస్‌మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే కొంతమంది మిల్లర్లకు నోటీసులు జారీ చేసి, వారి ఆస్తులను గుర్తించి బ్లాక్ చేసినట్లు తెలిపారు. ఇంకా బకాయి ఉన్న మిల్లర్లను గుర్తించి వారి ఆస్తులను బ్లాక్ చేయడంతో పాటు, బహిరంగ వేలం ద్వారా విక్రయించాల్సిందిగా సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి మిల్లర్లకు బ్యాంక్‌లు ఎలాంటి రుణాలు మంజూరు చేయకూడదని సూచించారు. మండల స్థాయిలో విత్తనాల దుకాణాలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, నకిలీ విత్తనాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

తగ్గిన ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్



సోన్ మండలం వెల్మల్ గ్రామ సమీపంలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో నిర్మించిన మిషన్ భగీరథ ఇన్‌టెక్ పంప్‌హౌస్ వద్ద నీటిమట్టం తగ్గింది. ఈ నెలాఖరు వరకు ఎండల తీవ్రత ఇలాగే ఉంటే ఇది పూర్తిగా అడుగంటే ప్రమాదముంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పంట మార్పిడి విధానమే మేలు



లక్ష్మణచాందలో దుక్కి సిద్ధం చేస్తున్న రైతు (ఫైల్)

- భూసారం పెరిగే అవకాశం
- అధిక దిగుబడులు సాధ్యం

లక్ష్మణచాంద: పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించే అవకాశమున్నట్లు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఏటా ఒకే రకమైన పంట సాగు చేస్తే భూమిలో సారం క్రమంగా తగ్గి దిగుబడులపై ప్రభావం పడుతుందని చెబుతున్నారు. పంట మార్పిడి విధానంతో నేలలో పోషకాలు వృద్ధి చెందుతాయని, తద్వారా దిగుబడి పెరిగే అవకాశముంటుందని పేర్కొంటున్నారు.

చీడపీడలకు అడ్డుకట్ట

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా సాగు చేస్తే చీడపీడల ఉధృతి పెరుగుతుంది. పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని పంటలకు తీవ్ర నష్టం కలిగించే అవకాశముంటుంది. పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవితచక్రం నాశనమవుతుంది. వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంట మార్పిడి విధానంతో అదుపు చేయవచ్చు. ఒకే లోతు వ్యవస్థ కలిగిన పత్తి, మిరప, వాణిజ్య పంటలను పంట మార్పిడి చేయకుండా సాగు చేస్తే ఒకే లోతు పొర నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల పూర్తిగా నిస్సారమవుతుంది. వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న పంటలు నేల పైపొరల నుంచి పోషకాలను గ్రహిస్తాయి. నేల భౌతిక లక్షణాలు, స్వభావం దెబ్బతినకుండా ఉండటానికి చీడపీడల ఉధృతి నిరోధానికి పంట మార్పిడి చేయాలి.

ప్రయోజనాలివే..

వరి తర్వాత మినుము, పెసర, శనగ లాంటి పంటలు సాగు చేస్తే వరిలో వచ్చే సుడి దోమ, టుంగ్రో వైరస్ తెగుళ్లను నివారించవచ్చు. పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న, నువ్వు, మినుము లాంటి పంటలు సాగు చేస్తే పత్తి పంటను ఆశించే లద్దె పురుగు, పచ్చ పురుగుల బెడదను అరికట్టవచ్చు. జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది. వరి వేసిన పొలాల్లో ముందుగా పప్పు ధాన్యాలు సాగు చేస్తే నేల సారవంతమవుతుంది. వేరుశనగలో ఆకుముడతను నివారించేందుకు పప్పు జాతికి చెందిన పంటలతో మార్పిడి చేయాలి. కంది, మిరప పంటల్లో ఎండు తెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి. నులిపురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వేరుశనగ, మిరప లాంటి పంటల సాగును కొన్ని సంవత్సరాల వరకు ఆపాలి. ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ లాంటి పంటలను పప్పు జాతి పంటలైన పెసర, మినుము, వేరుశనగ లాంటి పంటలతో పంట మార్పిడి చేయాలి. ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పంటలతో ఒకసారి, పప్పు జాతి పంటలతో మరోసారి పంట మార్పిడి చేయడం లాభదాయకం.

మార్పిడితో మంచి దిగుబడి



అన్నదాతలు ఎప్పుడూ ఒకేరకమైన పంటలు వేయొద్దు. పంట మార్పిడి విధానాన్ని పాటించాలి. దీంతో నేల సారం పెరిగి పంటలకు పోషకాలు సమృద్ధిగా అందుతాయి. తద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చు. రోగ కారక పురుగుల జీవితచక్రం ముగియడంతో పంటలపై రోగాల ఉధృతి తగ్గుతుంది. – వసంత్‌రావు, ఏవో, లక్ష్మణచాంద

క్యాన్సర్ రోగులకు ఉపశమనం

- నిర్మల్‌లో చికిత్సకు ఏర్పాట్లు
- పెద్దాస్పత్రిలో ప్రత్యేక వార్డులు
- త్వరలో అందుబాటులోకి సేవలు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ చికిత్స కేంద్రం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని క్యాన్సర్ రోగులకు మంచిరోజులు రానున్నాయి. చాపకింద నీరులా మానవాళిని కబళిస్తున్న క్యాన్సర్ మహమ్మారి నివారణకు సర్కారు బోధనాస్పత్రుల్లో ప్రత్యేక సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలోని వైద్యకళాశాలలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో 20 చొప్పున పడకలతో జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయనుంది. క్యాన్సర్ కేర్ కేంద్రంలో 10 పడకలను వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించేందుకు.. మిగతా 10 పడకలను పాలియేటివ్ కేర్ (పక్షవాతంతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఉపశమనం కలిగించే) నిమిత్తం వినియోగించనున్నారు. నిర్మల్ జనరల్ ఆస్పత్రిలో ఇదివరకే పాలియేటివ్ కేర్ కేంద్రం ఉంది. ఇక్కడ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకూ చికిత్స అందిస్తుండగా సేవలు విస్తరించనున్నారు. జెరియాట్రిక్ వార్డులు, క్యాన్సర్ కేర్ కేంద్రాలను ఇటీవల ప్రారంభించాల్సి ఉండగా.. అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే వీటిని అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

స్థానికంగానే చికిత్స

జిల్లా జనరల్ ఆస్పత్రిలో త్వరలో అందుబాటులోకి రానున్న జెరియాట్రిక్ వార్డు, కీమోథెరపీ లాంటి సేవల కోసం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఇద్దరు వైద్యులు, ఆరుగురు నర్సింగ్ ఆఫీసర్లు ప్రత్యేకంగా హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకున్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈ సేవలు అందుబాటులోకి రాగానే చాలామంది క్యాన్సర్ బాధితులు రెగ్యులర్ చెకప్‌లకు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లకుండా ఇక్కడే వీరి ఆధ్వర్యంలో ట్రీట్మెంట్ పొందనున్నారు.

బాధితులు పెరుగుతున్నందునే..

కేన్సర్ బారిన పడిన కొందరికి కీమోతోపాటు రేడియేషన్ థెరపీ అవసరమవుతుంది. కానీ.. ప్రభుత్వపరంగా ఆ సౌకర్యం లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. నాన్ కమ్యూనబుల్ డిసీజ్ ప్రోగ్రామ్ ద్వారా కేన్సర్ బాధితులను గుర్తిస్తుండగా.. మహిళా ఆరోగ్య కార్యక్రమం ద్వారా బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ కేన్సర్ బాధితుల గుర్తింపు కొనసాగుతోంది. వీరిలో వ్యాధి ప్రారంభ దశలో ఉంటే జిల్లాలోనే చికిత్స అందిస్తుండగా, సీరియస్ కేసులకు ప్రత్యేకంగా వార్డు లేదు. దీంతో కీమో, రేడియేషన్ థెరపీ కోసం వారిని హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కేన్సర్ బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మెడికల్ కళాశాలల అనుబంధ ఆస్పత్రుల్లో ప్రత్యేకసెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.


జెరియాట్రిక్ వార్డులతో ప్రయోజనాలు

మధుమేహం, హైపర్‌టెన్షన్, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ లాంటివి ఒకటి కంటే ఎక్కువ వ్యాధులు ఉండటంతో వృద్ధాప్యంలో వాటిని ఎదుర్కోవటం కష్టతరమవుతోంది. అలాంటివారికి ప్రత్యేక వార్డుల్లో నైపుణ్యం కలిగిన వైద్యులు (జెరియాట్రిషన్లు) అందుబాటులో ఉంటారు. వృద్ధులకు సరిపడా ఔషధాలు, చికిత్స అందిస్తారు. శారీరక, మానసిక, సామాజిక, ఆరోగ్య అంశాలను సమగ్రంగా పరిశీలిస్తారు. వృద్ధులు ఎదుర్కోబోయే సమస్యలను ముందస్తుగానే గుర్తిస్తారు. ప్రతీ రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్స విధానం రూపొందిస్తారు. ఒంటరితనం, ఒత్తిడి, ఆందోళన లాంటి మానసిక సమస్యలను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తారు. వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం వ్యాయామం, నిద్ర, ఒత్తిడి నిర్వహణపై అవగాహన కల్పిస్తారు. ప్రత్యేక సంరక్షణతో రోగులు త్వరగా కోలుకుంటారు.

కీమోథెరపీ, కౌన్సెలింగ్ ఒకేచోట..


రోగుల జీవన నాణ్యతను మెరుగుపరచటంతో పాటు క్యాన్సర్ మహమ్మారితో పోరాడే సహజ సామర్థ్యాన్ని పెంచేందుకు క్యాన్సర్ కేర్ కేంద్రాలు దోహదపడతాయి. క్యాన్సర్‌కు స్థానికంగా చికిత్స అందుబాటులో ఉండటంతో దూరప్రాంతాలకు ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రత్యేక క్యాన్సర్ కేర్ కేంద్రాలు ఉండటంతో రోగ నిర్ధారణ, చికిత్స త్వరగా ప్రారంభమవుతాయి. ఇవి రోగ నియంత్రణకు సహాయపడతాయి. క్యాన్సర్ చికిత్సలో నైపుణ్యం కలిగిన వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉంటారు. ఈ కేంద్రాలు క్యాన్సర్ గురించి సమాజంలో అవగాహన కల్పించటానికి, నివారణ చర్యలను ప్రోత్సహించటానికి తోడ్పడతాయి. కీమోథెరపీ, కౌన్సెలింగ్ లాంటి సేవలు ఒకే చోట అందుబాటులో ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా జనరల్ ఆస్పత్రిలో త్వరలో ప్రారంభించనున్న జెరియాట్రిక్, క్యాన్సర్ చికిత్స సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. చాలామంది నిరుపేదలకు ఈ సేవలు ఉచితంగా అందనున్నాయి.
– రాథోడ్ సునీల్ కుమార్, జిల్లా జనరల్ ఆస్పత్రి అడిషనల్ సూపరింటెండెంట్

వార్డులు సిద్ధం చేశాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ సూచనల మేరకు త్వరలోనే జిల్లా ప్రజలకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం. దీనికోసం వైద్యులకు ప్రత్యేక ట్రైనింగ్ ఇప్పించాం.
– డాక్టర్ గోపాల్‌సింగ్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

వెదురు తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌లు పట్టివేత


రేంజ్ కార్యాలయంలో ఐచర్ వ్యాన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధి నుంచి మంగళవారం రాత్రి వెదురు తరలిస్తున్న రెండు ఐచర్ వ్యాన్‌లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలం ఇస్లాంపూర్ నుంచి వెదురులోడ్‌తో రెండు వ్యాన్‌లు వస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు డీఆర్‌వో మమత, బీట్ అధికారులు లాలుబాయి, తిరుమలేశ్‌లు కిష్టాపూర్ సమీపంలో తనిఖీలు చేపట్టి ఐచర్‌వ్యాన్‌లను పట్టుకుని జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించారు. కాగా తాము అన్ని అనుమతులు పొందామని డ్రైవర్ శేఖర్ తెలపడంతో అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై రేంజ్ అధికారి సుష్మారావును సంప్రదించగా పర్మిట్‌పై విచారణ చేపడుతున్నామన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి గాయాలు

నర్సాపూర్(జి): మండలంలో మంగళవారం ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాసరకు చెందిన బాలాపురం లక్ష్మీనారాయణ రావు అనే యువకుడు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తుండగా నర్సాపూర్ (జి) గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో యువకుడికి గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాడిదకు అరుదైన శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో నివసించే మీనాబాయికి చెందిన గాడిదకు బుధవారం జిల్లా కేంద్రంలోని పశువైద్యశాల వైద్యులు డాక్టర్ గజానన్, డాక్టర్ దూద్‌రామ్ రాథోడ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గోపికిషన్‌లు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గాడిదకు చెందిన పిండం తల పెద్దగా ఉండి, మిగితా అవయవాలు అపరిపక్వంగా ఉన్నట్లు గుర్తించిన వైద్యులు జన్యులోపం కారణంగా ఇలా జరుగుతుందని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలో సిబ్బంది సాజిద్ అలీ, అమీన్, ఖాజా పాషా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. భర్త అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శ్రీరామ్ కాలనీకి చెందిన భోజన్న అనే వ్యక్తి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గత నెల 27న ఇంట్లో భార్య దాసరి విజయతో గొడవ చోటుచేసుకుంది. దీంతో ఆయన భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. 29వ తేదీన తిరిగి రాగా భోజన్న కనిపించకుండా పోయాడు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం..

పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైంది. ఓ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న విద్యార్థిని తండ్రి కలెక్టర్ చౌక్‌లో మంగళవారం ఉదయం వదిలిపెట్టి వెళ్లాడు. కళాశాలకు వెళ్లిన యువతి రాత్రి వరకూ తిరిగి రాలేదు. దీంతో యువతి తండ్రి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

పర్యావరణమే పరమౌషధం!


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులు(ఫైల్)

- జిల్లాలో తగ్గుతున్న అటవీ విస్తీర్ణం
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- పచ్చని చెట్లతోనే మనుగడ
- ప్రకృతి పరిరక్షణకు కొందరి ప్రయత్నం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం లక్షల హెక్టార్లలో ఉండేది. టేకు మద్ది, వెదురు తదితర వృక్ష జాతులతో దట్టమైన అడవులు విస్తరించి ఉండేవి. పోడువ్యవసాయంతో పాటు పెరుగుతున్న జనాభాకనుగుణంగా పట్టణ ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. కలప వినియోగం కూడా పెరిగిపోవడంతో అడవులు కనుమరుగవుతున్నాయి. క్రమేణ అడవుల శాతం తగ్గుతుండడంతో ప్రకృతి ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తున్నా, మరోవైపు విపరీతమైన ఉక్కపోత, తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రకృతిలో అసమతుల్యతకు ప్రధాన కారణం పర్యావరణంలో పచ్చదనం లోపించడమే. సహజ సిద్ధంగా ఏర్పడిన అడవులు, పచ్చని పరిసరాలను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతిని కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్న కొందరిపై ప్రత్యేక కథనం..

జిల్లా	అటవీ విస్తీర్ణం (హెక్టార్లలో)..
నిర్మల్	1,21,660
ఆదిలాబాద్	1,72,473
మంచిర్యాల	1,76,473
కుమరంభీమ్	2,44,540
మొత్తం	7,15,146

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. దానిని విధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదు. అన్ని జీవులతో పాటు మనిషి జీవనంలో భాగంగా ప్రకృతి మనుగడ కోసం పాటుపడాలి. మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించుకోవడం వల్ల భావితరాలకు సమతుల్యతతో కూడిన పర్యావరణాన్ని అందించగలుగుతాం.

– మహమ్మద్ నజీర్‌ఖాన్, డెప్యూటీ అటవీ క్షేత్రఅధికారి, సారంగపూర్

మొక్కల పెంపకంపై మక్కువ..


గింజలు నాటుతున్న పవన్‌కుమార్


పండ్ల విత్తనాలు

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన బి. పవన్‌కుమార్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ప్రకృతి సంరక్షణ, మొక్కల పెంపకంపై అమితమైన మక్కువ ఉంది. తన వంతు బాధ్యతగా పచ్చదనం పెంపొందించడానికి వినూత్నంగా ఆలోచించాడు. ప్రతీరోజు తిని పారవేసే వివిధ రకాల పండ్లలోని గింజలను ఎండబెట్టి భద్రపరుస్తాడు. వర్షాకాలం ప్రారంభంలో భద్రపర్చిన దాదాపు 10 కిలోల వరకు వివిధ రకాల పండ్లు, కాయలు తదితర విత్తన గింజలను అటవీ ప్రాంతంలో మట్టి తీసి నాటుతున్నాడు. ఏటా వర్షాకాలంలో సపోటా, మామిడి, బత్తాయి, అల్బుకార్, అల్లనేరేడు, సీతాఫలం తదితర విత్తనాలను మిత్రులతో కలిసి గుంతలు తీసి నాటుతున్నాడు. మరికొన్ని విత్తనాలను సీడ్ బాల్స్‌గా తయారుచేసి అడవిలో దూరంగా విసురుతుంటారు. ఇందులో 20శాతం మొక్కలు పెరిగినా తనకు సంతృప్తినిస్తుందని పవన్‌కుమార్ చెబుతున్నాడు.

పర్యావరణహిత బ్యాగులు..


విక్రయకేంద్రంలో క్యారీబ్యాగులతో తాన్న లక్ష్మి

పర్యావరణహితమైన క్యారీ బ్యాగులను సమాజానికి అందించాలనే లక్ష్యంతో డీఆర్డీవో (భారత రక్షణ పరిశోధన సంస్థ) సాంకేతిక సహకారంతో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన తాన్న లక్ష్మి అనే మహిళ బయోడీగ్రేడబుల్(మట్టిలో సహజంగా కుళ్లిపోయే) సంచుల విక్రయశాల నిర్వహిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రజలను, వినియోగదారులను తన వంతుగా చైతన్యపరుస్తోంది. దీన్ని లాభసాటి వ్యాపారంగా కాకుండా ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమంగా భావించి జిల్లాకేంద్రంలో అవుట్‌లెట్ విక్రయకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లను కలిసి ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరిస్తూనే ఈ బయోడీగ్రేడబుల్ క్యారీ బ్యాగులను వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్యారీ బ్యాగులు కేవలం 30 రోజులలోపే భూమిలో కరిగి సేంద్రియ ఎరువుగా మారుతాయి.


నేలలో కరిగిపోయే క్యారీబ్యాగులు

తాత్కాలికంగా పలు రైళ్ల రద్దు

బెల్లంపల్లి: కాజీపేట్ సబ్ డివిజన్ పరిధి బెల్లంపల్లి -రేచ్నీరోడ్ రైల్వేస్టేషన్ సెక్షన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసి, మరికొన్ని రైళ్ల హాల్టింగ్‌ను తాత్కాలికంగా రైల్వేశాఖ ఎత్తివేసింది. రద్దు, హాల్టింగ్‌ల ఎత్తివేత ప్రక్రియ ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అమలులో ఉంటుంది. కాజీపేట్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ప్యాసింజర్, బల్లార్షా -కాజీపేట్, సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్‌ఎక్స్‌ప్రెస్, భద్రాచలంరోడ్ -బల్లార్షా రైళ్ల రద్దు కాగా సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంచిర్యాల వరకు నడుపనున్నారు. మైసూర్ -జైపూర్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ -న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -దానాపూర్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి -హజ్రత్ నిజాముద్దిన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలికంగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఎత్తివేసినట్లు రైల్వే అధికారులు ప్రకటించారు.

కాజీపేట్ -బల్లార్షా మధ్య..

కాగజ్‌నగర్‌టౌన్: కాజీపేట్ -బల్లార్షా మధ్య పలు రైళ్లను ఈ నెల 20 వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ సీవోఎం కె. మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ -సిర్పూర్, కాజీపేట్ -సిర్పూర్, సికింద్రాబాద్- కాగజ్‌నగర్, కరీంనగర్ -బోధన్, గోరఖ్‌పూర్- త్రివేండ్రంతో పాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, రేచినిరోడ్ మధ్యలో థర్డ్‌లైన్ పనులు జరుగుతున్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఐపీఎల్ బెట్టింగ్.. ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఐపీఎల్ మ్యాచ్‌కు ఆన్‌లైన్ బెట్టింగ్ చేసిన ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. మంగళవారం ఐపీఎల్ మ్యాచ్‌లో పట్టణంలోని కల్పనబార్‌లో పనిచేసే మంచాల నిఖిల్ రెడ్డి ఆన్‌లైన్‌లో రూ.4,500 బెట్టింగ్ పెట్టాడు. బట్టిసావర్గాంకు చెందిన ముస్తాల సాయిమహేశ్, వెంకట్‌లు వరుసగా రూ.2,200, రూ.1,400 ఆన్‌లైన్ బెట్టింగ్ చేయగా పట్టుకుని వారి నుంచి సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


భీమన్న (ఫైల్)

లక్ష్మణచాంద: హైదరాబాద్‌లో రైలు ఢీకొని మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వడ్యాల్ గ్రామానికి చెందిన భీమన్న(55) గతంలో గ్రామంలో పశువుల కాపరిగా పని చేసేవాడు. ఈ సంవత్సరం జీవనోపాధి కోసం మేస్త్రీ పని చేసేందుకు హైదరాబాద్ వెళ్లాడు. బుధవారం పని కోసం వెళ్లే క్రమంలో హైదరాబాద్‌లోని నాంపల్లిలో రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తల, ముఖానికి తీవ్ర గాయాలైన భీమన్న అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి ఆధార్‌కార్డు సహాయంతో కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా విషయం తెలియజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు, అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు, ఇంటి చుట్టుపక్కల వారు విరాళాలు సేకరిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెట్టుమీద పడి ఒకరు..


ఆశయ్య (ఫైల్)

దండేపల్లి: చింతచెట్టును రంపం మిషన్‌తో కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు మీద పడి కూలీ మృతి చెందిన ఘటన దండేపల్లి మండలం కన్నెపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కన్నెపల్లికి చెందిన ఇండ్ల ఆశయ్య(65) గ్రామంలోని ఓ ఇంటి పెరటిలో గల చింతచెట్టును మరో ఇద్దరు కూలీలతో కలిసి రంపం మిషన్‌తో కోస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా చెట్టు విరిగి ప్రమాదవశాత్తు ఆశయ్యపై పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతుడి కుమారుడు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోటోవేటర్ కిందపడి ఒకరు..

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామంలో మంగళవారం రాత్రి బాసర మండలం టాక్లి గ్రామానికి చెందిన పిక్లెకర్ దత్తు (45) అనే వ్యక్తి ట్రాక్టర్ రోటోవేటర్ కింద పడి మృతిచెందినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. సింగన్‌గాం గ్రామానికి చెందిన బొడ్కె సాయినాథ్ అనే యువకుడు గత ఐదేళ్లుగా దత్తు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి డ్రైవర్ సాయినాథ్ భూమిని చదును చేసేందుకు దత్తుతో కలిసి సింగన్‌గాం గ్రామానికి చేరుకున్నారు. చదును చేస్తున్న క్రమంలో ట్రాక్టర్‌పై కూర్చున్న దత్తు ప్రమాదవశాత్తు రోటోవేటర్ కింద పడి మృతిచెందాడు. విషయాన్ని డ్రైవర్ సాయినాథ్ దత్తు కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. బుధవారం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఏఎస్సై భానుప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. దత్తు భార్య అనుషాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ యువతి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా సుంగగూడకు చెందిన గంగాసాగర్ (20) అనే యువతి రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇంట్లో ఉండి ఏ పనులు చేయకపోవడంతో తండ్రి మందలించగా మనస్తాపానికి గురైన యువతి పురుగుల మందు తాగింది. చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన పేర్కొన్నారు.

అంబులెన్స్ ఆలస్యం.. గర్భిణీ మృతి


తారాబాయి (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: 108 అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ఎనిమిది నెలల గర్భిణీ గుండెపోటుతో మృతిచెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన గర్భిణీ కుర్సెంగ తారాబాయి (26)కి ఆదిలాబాద్ చింతలబోరికి చెందిన మాన్కుతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆమె 8 నెలల గర్భిణీ. బుధవారం దంతన్‌పల్లి పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంది. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. గంట ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరీక్షించి ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రి వైద్యులు పరీక్షించి గుండెపోటుతో తారాబాయి మృతి చెందినట్లు తెలిపారు. 108 అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే గర్భిణీ బతికి ఉండేదని కుటుంబ సభ్యులు రోధిస్తూ తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గర్భిణుల కోసం ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిషేధిత కలుపు మందు పట్టివేత

నార్నూర్: మహారాష్ట్రలోని జివితి గ్రామం నుంచి అక్రమంగా తీసుకొస్తున్న నిషేధిత కలుపు మందు (రౌండప్)ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై జీవన్‌రెడ్డి, ఏవో వెంకన్నలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇంద్రవెల్లి మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు మహారాష్ట్రలోని జివితి ప్రాంతం నుంచి నిషేధిత కలుపు మందు నాలుగు కాటన్‌లలో మొత్తం 32 బాటిళ్లు తరలిస్తుండగా, గాదిగూడ మండల కేంద్రంలో పట్టుకున్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేస్తామన్నారు.

ఉరేసుకుని యువరైతు ఆత్మహత్య


గంగారాం (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన ఓ యువరైతు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుస్లీ గ్రామానికి చెందిన బొగడమీది గంగారాం (35) అనే యువరైతు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 14 సంవత్సరాల క్రితం వెంకూర్ గ్రామానికి చెందిన మీనాతో వివాహమైంది. గత నెల క్రితం భార్యభర్తల మధ్య చిన్నచిన్న గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక తన భార్య రాదేమోననే బెంగతో జీవితంపై విరక్తి చెందిన గంగారాం మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి బొగడమీది గణపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'నవోదయ'ం పిలుస్తోంది..!

- 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- సీటు సాధిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

నవోదయ ప్రవేశపరీక్ష వివరాలు..
జిల్లాలో మొత్తం సీట్లు: 80
గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 60
పట్టణ ప్రాంత విద్యార్థులకు 20
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 27
ప్రవేశపరీక్ష: డిసెంబర్ 13



నవోదయ విద్యాలయం

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి కాగజ్‌నగర్‌లో నవోదయ విద్యాలయం ఉంది. విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఏటా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతీ ఏడాది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 5వేల మందికి పైగా విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. జవహర్ నవోదయలో సీటు సాధిస్తే క్రమశిక్షణతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, తద్వారా పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడుతాయని తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రవేశపరీక్ష రాయిస్తున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధిక సీట్లు..

విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా కేంద్రం కొన్ని దశాబ్దాల క్రితమే దేశవ్యాప్తంగా నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులు. ప్రవేశ పరీక్ష ల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి 2026 -2027 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో సీటు లభిస్తుంది. దరఖాస్తుకు చివరి తేదీ జూలై 27 కాగా, డిసెంబర్ 13న ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌లో ఉచితంగా విద్య అందిస్తారు. 6వ తరగతిలో 80 సీట్లు ఉండగా.. 60సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తుండగా, 20సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు. బాలికలకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా నిబంధనలు చూసి తప్పులు లేకుండా, గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలి.

– కొడాలి పార్వతి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, కాగజ్‌నగర్

కాలేజీకి వెళ్లాల్సిన కొడుకు కాటికి..!

- స్నేహితులతో సరదాగా గడిపేందుకు ఏసీసీ క్వారీకి..
- స్నానానికి క్వారీలోకి దిగిన ఇద్దరు స్నేహితులు
- నీట మునిగి ఒకరు మృత్యువాత


మృతుడు హర్షిత్ (ఫైల్)


రోదిస్తున్న హర్షిత్ తల్లిదండ్రులు

మంచిర్యాలక్రైం: మరొక్క రోజు గడిస్తే కొడుకు కాలేజీకి వెళ్తాడని తల్లిదండ్రులు అంతా సిద్ధం చేశారు. పదో తరగతి పూర్తి చేసిన తనయుడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఇంటర్మీడియెట్ కళాశాలలో చేర్పించేందుకు ఫీజు కూడా చెల్లించారు. స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు ఏసీసీ క్వారీకి వెళ్లిన విద్యార్థి.. స్నానానికి క్వారీలోకి దిగి మృత్యువాత పడ్డాడు. కాలేజీకి వెళ్తాడనుకుంటే కనిపించకుండా పోయాడంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అక్కడున్న వారికి కలిచివేసింది. ఈ సంఘటన మంచిర్యాల పోలీసుస్టేషన్ పరిధిలోని ఏసీసీ క్వారీ వద్ద చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి, విద్యార్థి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌లో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి సాదుల ప్రసాద్ నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య లావణ్య కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు హర్షిత్ (15), ధనుష్ ఉన్నారు. హర్షిత్‌ను హైదరాబాద్‌లోని పాఠశాలలో చదివించారు. ఇటీవల పదో తరగతి పూర్తి చేయగా ఇంటర్ కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు కళాశాలలో చేర్పించారు. ఈ నెల 5న కాలేజీకి వెళ్లాల్సి ఉండగా అన్ని ఏర్పాట్లు చేశారు.

స్నేహితులతో వెళ్లి..

హర్షిత్ చిన్ననాటి స్నేహితులు అందరూ పదో తరగతి పూర్తి చేసి వేర్వేరు కళాశాలల్లో చేరారు. గురువారం హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉండడంతో స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు మంగళవారం ఏసీసీ క్వారీకి వెళ్లారు. బిర్యానీ పార్టీ చేసుకుని ఫొటోలు దిగారు. స్నానం చేసేందుకు హర్షిత్‌తో పాటు మరో స్నేహితుడు క్వారీలోకి దిగారు. హర్షిత్ లోతుకు వెళ్లి నీట మునిగి చనిపోయాడు. గమనించిన స్నేహితులు భయంతో బయటకు వచ్చి ఏం చేయాలో తెలియక రోదిస్తూ వెళ్లిపోయారు. హర్షిత్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి ప్రసాద్ స్నేహితులను ఆరా తీయగా.. సాయంత్రం క్వారీకి వెళ్లినట్లు తెలిపారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా.. స్కూటీ, నీటిమడుగు పక్కనే డ్రెస్, చెప్పులు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మంగళవారం రాత్రి కావడంతో బుధవారం ఉదయం గజఈతగాళ్లతో గాలించగా హర్షిత్ మృతదేహం లభించింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్వారీ ప్రాంతంపై నిఘా పెంచాలి

ఏసీసీ క్వారీ దట్టమైన అటవీ ప్రాంతం. అత్యంత ప్రమాదకరమైన క్వారీ. పెద్ద పెద్ద నీటి మడుగులు ఉంటాయి. పైగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా రావు. ఏదైనా ప్రమాదం జరిగితే సమాచారం ఇవ్వడం కష్టమే. ఇంతటి ప్రమాదకరమైన ప్రాంతం వద్ద అధికారులు నిషేధం విధించారు. అయినా సరదాగా గడిపేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు ఏసీసీ క్వారీ అడ్డాగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏసీసీ క్వారీ ప్రాంతంపై నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని సీబాపు కాలనీలో మంగళవారం సాయంత్రం జరిగిన హత్య కేసులో ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు చెందిన సయ్యద్ దావుద్ అలీతో పాటు మహ్మద్ షాహీద్, మహ్మద్ షాహీద్ హుస్సేన్‌లు సీబాపు కాలనీ సమీపంలో పెద్దవాగుకు వెళ్లే దారిలో బీర్లు తాగుతుండగా కాపువాడకు చెందిన షేక్ అక్బర్ అలియాస్ అబ్బు, షేక్ జమీర్, షేక్ అమీర్, దుర్వే రాఘవేంద్ర అలియాస్ అచ్చు, షేక్ రేయాన్, పోచమ్మ బస్తీకి చెందిన గిరిగుల రాజేశ్, సీబాపు కాలనీకి చెందిన గోగర్ల రూపేశ్‌లు దాడి చేయగా దావుద్ మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడు సయ్యద్ దావుద్ అలీ, మహ్మద్ షాహీద్ హుస్సేన్‌లతో నిందితులకు పాత కక్షలు ఉండడంతో దాడి చేశారని వివరించారు. నిందితుల నుంచి స్టీల్ కడియం, రక్తపు మరకలషర్ట్, బీరు సీసాలు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. షేక్ అక్బర్, షేక్ జమీర్, గోగర్ల రూపేశ్, రేయాన్‌లపై పలు స్టేషన్లలో ఇంతకు ముందు కేసులు ఉన్నాయన్నారు. సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై సందీప్ కుమార్‌లు పాల్గొన్నారు.